క్లుప్తంగా

వీరాంజనేయ స్వామికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్‌దీక్షా పీఠంలో వేంచేసిన వీరాంజనేయ స్వామికి మంగళవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా స్వామికి పంచామృత అభిషేకాలు, అర్చన, అనంతరం తమల పాకులతో విశేషంగా పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి వారి దీక్షలను స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామికి పంచ హారతుల సేవ నిర్వహించారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబరు 105కి చెందిన షేక్ రేష్మా, రుహుల్లా భార్యభర్తలు. వీరికి 2001లో వివాహమైంది. రుహుల్లా రైల్వే కూలీగా పని చేస్తుంటాడు. గత కొంత కాలంగా రుహుల్లా మద్యానికి బానిసై కుటుంబానికి పట్టించుకోవడం లేదు. దీనిపై అడిగినప్పుడల్లా రుహుల్లా భార్యను వేధింపులకు గురి చేయడమే కాకుండా ఎవరితో మాట్లాడినా అక్రమ సంబంధం అంటకడుతున్నాడు. దీంతో రేష్మా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు సుబార్జన్



విజయవాడ స్పోర్ట్స్: పాలిటెక్నిక్ జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు విజయవాడకు చెందిన కె.సుబార్జన్ ఎంపికయ్యాడు. ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు విజయవాడ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 25వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడమే కాకుండా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో ఢిల్లీలో జరిగే పాలిటెక్నిక్ జాతీయ క్రీడలకు సుబార్జన్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారు. సుబార్జన్ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నాడు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారుడిని కోచ్‌లు శ్రీనివాస్, అక్రమ్ అభినందిచారు.

గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ రాణిసుస్మితచే ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొనే అభ్యర్థులు వారు ప్రతి రోజూ రాసే సమాధానాలను క్షుణ్ణంగా పరిశీలించి, మరింత మెరుగ్గా సమాధానాలు రాసే విధానంతో పాటు ప్రిపరేషన్ టిప్స్, ఆన్సర్ రైటింగ్, జీఎస్ తదితర అంశాలపై తగు సూచనలు, సలహాలు ఇస్తామని తెలిపారు. హైదరాబాద్ ఆశోక్ నగర్‌లోని అకాడమీ కార్యాలయం వేదికగా నిర్వహించే ఈ శిక్షణ తరగతులను మెయిన్స్ పరీక్ష పూర్తయ్యేవరకు ఉపయోగించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. పూర్తి వివరాలకు 040-35052121, 91332 37733 లో సంప్రదించాలని కోరారు.

భ్రమరాంబ మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఈ నెల 18వ తేదీ మహా శివరాత్రిని పురస్కరించుకుని కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో వేంచేసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామికి మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్వామికి 14 కలశాలతో మహాన్యాస రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. స్వామికి విశేష అభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణ జరుగుతుందని భక్తులు స్వామిని దర్శించుకుని తరలించాలని తెలిపారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రావూరి వెంకటేశ్వరరావు, ఎఫ్ఎం చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ సాయిబాబా కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్‌వైర్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిబాబా కాలనీలోని అన్ని లైన్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పోషణ్ ప్రాజెక్టుకు పూర్తి సహకారం

కలెక్టర్ ఢిల్లీరావు



హోం సైన్స్ విభాగం రూపొందించిన రెసిపి పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు, చిన్నారుల్లో పౌష్టికాహార స్థితిని మెరుగుపరిచేలా, మంచి ఆహారం తీసుకునేలా వారికి అవగాహన కల్పించేందుకు టాటా ట్రస్ట్, ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ సంస్థల సహకారంతో నిర్వహించే ఎస్ టూ పోషణ్ ప్రాజెక్టు కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ సహకారంతో పీ అండ్ జీ హెల్త్ కేర్ సేవలతో జిల్లాలో చేపట్టే ఎస్ టూ పోషణ్ ప్రాజెక్టు అమలుపై మంగళవారం నగరంలోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మైలవరం మండలం గణపవరం, వెల్వడం, సబ్జాపాడు, దాసులపాలెం, కొత్తగూడెం గ్రామాలలో పైలట్ ప్రాజెక్టుగా ఎస్ టూ పోషణ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మహిళాభివృద్ధి శిశు, సంక్షేమ శాఖ సహకారంతో పోషకాహార ఫలితాలను పెంచేందుకు పలు కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. ఆహారాన్ని వండే విధానంలో పోషక విలువలు నష్టపోకుండా మహిళలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎత్తుకు తగ్గ బరువు, బరువుకు తగ్గ ఎత్తు కలిగిన పిల్లలను గుర్తించి వారిలో వైవిధ్యాన్ని నివారించి అదనపు పోషకాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. పిల్లలలో ఎదుగుదల లేకపోవడం, పోషకాహారలోపం, తక్కువ బరువుతో పుట్టడం, గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనతను నివారించేందుకు ఎస్ టూ పోషణ్ దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యక్తిగత గృహాలలో 100కు పైగా న్యూట్రీ గార్డెన్లను ప్రోత్సహించడం ఈ ప్రాజెక్టులో భాగమన్నారు. స్వదేశీ, పౌష్టికాహార వంటకాలను ప్రోత్సహించేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం భాగస్వామ్యం కలిగి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్ టూ పోషణ్ ద్వారా చేపట్టే ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ అన్నారు. అనంతరం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం హోంసైన్స్ విభాగం రూపొందించిన 'గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక సహిత వంటకాలతో రెసిపి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. టాటా ట్రస్ట్ న్యూట్రిషన్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సుజీత్ రంజన్, టాటా ట్రస్ట్ పార్టనర్ షిప్ టీమ్ సభ్యులు కావేరి, కృష్ణన్, టాటా ట్రస్ట్ రీజినల్ మేనేజర్ రాజేంద్రబాబు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, పీ అండ్ జీ హెల్త్ ఆఫీసర్ క్యాసి మిలో, టాటా ట్రస్ట్ న్యూట్రిషియన్ లీడ్ మధుసూదన్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీకి రాష్ట్రంలో స్థానం లేదు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): జనసేన, టీడీపీలకు రాష్ట్రంలో స్థానం లేదని, ఆ పార్టీలకు ఒంటరిగా పోటీ చేసి గెలిచే ధైర్యం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 34వ డివిజన్ 225వ సచివాలయం పరిధిలోని ఖుద్దుస్‌నగర్‌లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్, ఏపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలిసి ఆయన పర్యటించారు. డివిజన్‌లోని పలు వీధుల్లో తిరిగి ప్రజలనుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నర ఏళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సమస్యలు ఉంటే వలంటీలర్లకు లేదా స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకురావాలన్నారు. వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి పథకం అర్హులందరికీ అందేలా చూస్తున్నామన్నారు. డివిజన్‌లో రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కారానికి కృషి చేశామన్నారు. చిన్న సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు లేదా కార్పొరేటర్ దృష్టికి తీసుకొస్తే వాటిని కూడా పరిష్కరిస్తారని తెలిపారు. ప్రతి పక్ష నాయకులు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని తెలిపారు. ఎవరు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్ సీపీ ఒంటరిగా ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు మాబు, మస్తాన్, శరత్‌బాబు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ వలంటీర్లు పాల్గొన్నారు.

13న వాహనాల వేలం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 13 వాహనాలకు (రెండు కార్లు, 11 టూ వీలర్స్) ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు స్టేషన్ వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు/మూడు చక్రాల వాహనానికి రూ.10 వేలు, ద్విచక్రవాహనానికి రూ.5వేలు చొప్పున ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రిఫండబుల్) కట్టి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. వేలం పాటకు సంబంధించిన పూర్తి వివరాల కోసం భవానీపురం ఎస్ఇబీ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వీవీ వేణుగోపాలరావు 99493 69538, కానిస్టేబుల్ సీహెచ్ సుబ్రహ్మణ్యం 80742 69210లో సంప్రదించాలని కోరారు.

రేపు ఉచిత బోన్ ఫంక్షన్ పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎముక సంబంధిత సమస్యలను ముందుగానే కనిపెట్టి ప్రివెంటివ్ చికిత్సను అందించేందుకు వీలుగా గురువారం చుట్టుగుంట డాక్టర్ చల్లా హరికుమార్ హాస్పిటల్‌లో ఉచిత బోన్ ఫంక్షన్ (బీఎండీ) పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ చల్లా హరికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.1,500 నుంచి రూ.2 వేల విలువచేసే బీఎండీ పరీక్షలను గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పేదలకు సైతం మంచి ఆరోగ్యం అందాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన ఉచిత బీఎండీ పరీక్షలను చేయించుకోదలచిన వారు ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోలని సూచించారు. నగరవాసులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని వారి ఎముకల సామర్థ్యాన్ని తెలుసుకోవాలని ఆయన కోరారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



రజనీకాంత శర్మను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కంటికి సంబంధించిన ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణువర్ధన్, గంధం శ్రీనివాస్ సూచించారు. విజయవాడ వన్‌టౌన్ ఇస్లాంపేటకు చెందిన అయాన్ ఐ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. న్యాయవాదులు, న్యాయస్థానాల ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబసభ్యుల దృష్టి దోషాలపై పరీక్షలు నిర్వహించారు. శుక్లాలు, నీటికాసులు తదితర కంటి సమస్యలను నిర్ధారించి అవసరమైనవారికి మందులు అందజేశారు. కాలం చెల్లిన కళ్లజోళ్లను వాడుతున్న వారికి తగిన సూచనలు చేశారు. ఈ శిబిరంలో ఎంజే నాయుడు హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ కేటరాక్టపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఆయన్ను సత్కరించారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చంద్రరావు



రెబ్బా చంద్రరావు

విజయవాడ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని, పాలకులు తీసుకుంటున్న నిర్ణయాలకు పేదరిక నిర్మూలనకు దోహదపడుతున్నాయని భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రెబ్బా చంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దార్శినికతతో పరిపాలన రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు, శాసన రాజధానిగా అమరావతిని ప్రకటించారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం బడుగు బలహీన వర్గాలపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమకు ప్రత్యక్ష సాక్ష్యమని పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించడం విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిలువుటద్దంగా నిలిచిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో మంది పేదలకు ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలందిస్తుందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు కోట్లాది మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేయడం గతంలో ఎన్నడూ జరగలేదని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్లు మంజూరు చేయడం, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ల చిత్తశుద్ధి, అంకిత భావానికి నిదర్శనమని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే విధంగా ప్రజారంజక పాలనను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనసాగించాలని చంద్రరావు ఆకాంక్షించారు

దళితులు, గిరిజనులకు కేంద్రం న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న జల్లి విల్సన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర బడ్జెట్‌లో దళిత, గిరిజన, పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వెంటనే బడ్జెట్‌ను సవరించడం ద్వారా ఆయా ప్రజలకు న్యాయం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ, ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ పథకాలకు కేటాయింపుల్లో జరిగిన అన్యాయంపై రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం, రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి, రాష్ట్ర గిరిజన సమాఖ్యల ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ వద్ద కేంద్ర ప్రభుత్వ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.89,400 కోట్లు కేటాయించారని, ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉండగా దానిలో 30 శాతం కోత విధించి కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయం అన్నారు. ప్రతి వ్యవసాయ కూలీకి వంద రోజులు ఉపాధి కల్పించి రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప పాల్గొన్నారు.

మామపై ఇటుక రాయితో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మామపై ఇటుక రాయితో దాడికి పాల్పడిన ఓ అల్లుడిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు పాత రాజరాజేశ్వరిపేట మహంకాళీ గుడి ప్రాంతానికి చెందిన మహ్మద్ కరీముల్లాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె రెహానాను షేక్ సిలార్ బాషాకు ఇచ్చి తొమ్మిదేళ్ల కిందట వివాహం జరిపించారు. పెయింటింగ్ పని చేసే సిలార్‌బాషా ఇంట్లో సరిగా డబ్బులు ఇవ్వకపోవడంతో రెహానా పుట్టింటికి వచ్చేసింది. ఇదే విషయమై అల్లుడు సిలార్ బాషాను కరీముల్లా గట్టిగా నిలదీశాడు. దీనిని మనస్సులో పెట్టుకుని సలార్ బాషా ఈ నెల ఐదో తేదీన ఎర్రకట్ట మీద నుంచి వస్తున్న కరీముల్లాపై ఇటుక రాయితో దాడికి పాల్పడ్డారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా శ్రీవారి ద్వాదశ ప్రదక్షిణలు

- శాస్త్రోక్తంగా స్వామి వారి ఏకాంత సేవ
- ముగిసిన బ్రహ్మోత్సవాలు



ద్వాదశ ప్రదక్షణల సందర్భంగా ఊరేగుతున్న స్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. నగరంలో పురాతన ఆలయాల్లో ఒకటైన వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అందులో భాగంగా ఆలయంలోని స్వామి సన్నిధిలో మంగళవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రాత్రి స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. సర్వాలంకార భూషితునిగా స్వామిని అలంకరించిన అర్చకులు ఆలయం చుట్టూ 12 సార్లు స్వామిని ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్, పాలకమండలి మాజీ చైర్మన్ పాపారావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం కోసం బాలిక తండ్రి వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆడుతూ పాడుతూ తిరగాల్సిన వయస్సులో ఓ చిన్నారి అత్యంత అరుదైన సికిల్ సెల్ ఎనీమియాబారి నపడింది. దీంతో 15 సంవత్సరాల వయస్సులోనే బాలిక బహుళ అవయవాలు పనిచేయకుండా పోయాయి. దీంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న తమ బిడ్డను బతికించుకునేందుకు తండ్రి శక్తికి మించి ఖర్చు చేసి, ఆపన్నహస్తం అందించే సహృదయుల నుంచి సాయంకోసం వేడుకుంటున్నారు. వివరాలు ఇలా.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన మీసాల రాజు ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన 15 ఏళ్ల కుమార్తె ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా సికిల్ సెల్ ఎనీమియా కారణంగా మెదడు, గుండె, మూత్రపిండాలు వంటి ప్రధాన అవయవాలు పనిచేయక పోవడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బిడ్డను బతికించుకునేందుకు తన శక్తికి మించి ప్రయత్నిస్తున్నానని, తన కుమార్తె వైద్యానికి రూ.25 లక్షల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని, ఇప్పటికే రూ.8 లక్షల వరకూ అప్పులు చేసి ఖర్చు చేసినట్లు తెలిపారు. దిక్కుతోచని స్థితిలో ప్రాణాపాయంలో ఉన్న తన కుమార్తెను ఆదుకునేందుకు ఆపన్నహస్తం అందించాలని తండ్రి రాజు వేడుకుంటున్నారు. బాలిక వైద్యానికి సాయం అందించాలనుకునే సహృదయులు ఆమె తండ్రి రాజు సెల్ నంబరు 98669 09069లో సంప్రదించవచ్చు.

యూపీహెచ్‌సీలను సందర్శించిన గుజరాత్ వైద్యాధికారులు



హెచ్‌బీ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద గుజరాత్ వైద్యాధికారులతో జిల్లా అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలను గుజరాత్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన వైద్య అధికారుల బృందం మంగళవారం హెచ్‌బీ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు, మరికొన్నింటిని సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అమలవుతున్న కార్యక్రమాలు, వివిధ సేవలు, సౌకర్యాలు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ గుర్తింపు సంఖ్యల ప్రగతి, టెలీ మెడిసిన్ పనితీరు వంటి అంశాలను పరిశీలించారు. గుజరాత్‌లోని ఆయుష్మాన్‌భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) జాయింట్ డైరెక్టర్ (ఐటీ) బూర్గ్ రాజ్ త్రివేది, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ కార్యక్రమ అధికారి ఫారేక్ విచ్చేశారు. వీరికి రాష్ట్ర ఏబీడీఎం కార్యక్రమ అధికారి ఎన్వీ కోటిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుహాసిని ఇక్కడ అందుతున్న సేవలను వివరించారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డీపీఎంఓ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఇస్లామిక్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయాలని వినతి



ఇంతియాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఖాజా మొహిద్దీన్, నాగూర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్‌లో ఇస్లామిక్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ముస్లిం మైనార్టీలకు వడ్డీ లేని రుణాలను అందజేసి ఆర్థికంగా ఆదుకోవాలని అంజుమన్-ఎ-ఇస్లామియా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ఖాజామొహిద్దీన్, షేక్ నాగూర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఏపీ మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని వక్ఫ్‌బోర్డ్‌కు చెందిన స్థలాల్లో గృహసముదాయాలు నిర్మించి ముస్లిం మైనార్టీలకు లీజుకు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేసిందని, దీనిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి వారి సంక్షేమం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు.

మేరీ మాత ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు



మేరీమాత ఆలయ మ్యాప్‌ను పరిశీలించి బందోబస్తు విధులు కేటాయిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

విజయవాడ స్పోర్ట్స్: గుణదల మేరీ మాత ఉత్సవాలు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులు, వాహన చోదకుల సౌకర్యార్థం నగరంలో వాహనాల రాకపోకలు దారి మళ్లిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం డీసీపీ విశాల్‌గున్ని మేరీ మాత క్షేత్రం పరిసరాలను పరిశీలించి బందోబస్తు విధులు నిర్వర్తించే పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం రాత్రి నుంచి 12వ తేదీ అర్ధరాత్రివరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. గుణదల పడవలరేవుసెంటర్ నుంచి ఈఎస్ఐ ఆస్పత్రి వరకు, గంగిరెద్దులదిబ్బ నుంచి బెత్లహేం నగర్ వరకు ఎలాంటి వాహనాలను అనుమతించబోమన్నారు. రామవరప్పాడు రింగ్ నుంచి మాచవరం డౌన్, ఈఎస్ఐ జంక్షన్ వరకు ఆటోరిక్షాలను మాత్రమే అనుమతిస్తామన్నారు.

- పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, ఆటోనగర్ ప్రాంతాలకు వెళ్లే బస్సులు పీసీఆర్ జంక్షన్, ఆర్టీసీ వై జంక్షన్, విజయటాకీస్, చుట్టగుంట జంక్షన్ నుంచి కుడి వైపునకు తిరిగి విశాలాంధ్ర రోడ్డు, నైస్‌బార్ జంక్షన్, జమ్మిచెట్టు సెంటర్, సిద్ధార్థ జంక్షన్, అమ్మ కల్యాణమండపం, క్రీస్తురాజుపురం, సాయి హోటల్ జంక్షన్, డెంటల్ ఆస్పత్రిరోడ్, మహానాడు జంక్షన్ మీదుగా రామవరప్పాడు చేరుకుని గన్నవరం, ఆటోనగర్ ప్రాంతాలకు చేరుకోవాలన్నారు.
- గన్నవరం, ఆటోనగర్ నుంచి బస్టాండ్‌కు వచ్చే బస్సులు రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరు రోడ్డులోకి ప్రవేశించి ఈఎస్ఐ జంక్షన్ నుంచి ఎడమ వైపునకు తిరిగి గుణదల పోస్టాఫీస్, మద్దే రావమ్మ గుడి జంక్షన్, సంగం డెయిరీ జంక్షన్, మాచవరం పోలీస్‌స్టేషన్, అమ్మ కల్యాణ మండపం, సిద్ధార్థ జంక్షన్, జమ్మిచెట్టు సెంటర్, శిఖామణి సెంటర్, రెడ్ సర్కిల్, గోపాలరెడ్డి రోడ్, ఆర్ఐవో జంక్షన్, మహంతి మార్కెట్, బందరు లాకులు, పీసీఆర్ జంక్షన్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి.
- గుణదల మేరీ మాత ఉత్సవాలకు వచ్చేప్రత్యేక బస్సులు బస్టాండ్ నుంచి పీసీఆర్ జంక్షన్, ప్రకాశం విగ్రహం, రైల్వే స్టేషన్ తూర్పు బుకింగ్, ఏలూరు లాకులు, జీఎస్ రాజు రోడ్డు, జింఖానా జంక్షన్, సీతన్నపేటగేటు నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డుకి తిరిగి శారదాకాలేజీ జంక్షన్, ఫుడ్‌జంక్షన్, మధురానగర్ కొత్తవంతెన మీదుగా ఆర్టీసీ డిపో యాజమాన్యం ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండ్ వరకు చేరుకోవాలి.
- రామవరప్పాడు రింగ్ నుంచి బీఆర్టీఎస్ రోడ్డుకు రాకపోకలు సాగించే వాహనాలు మహానాడుజంక్షన్, రమేష్ ఆసుపత్రి, అమ్మ కల్యాణ మండపం, సిద్ధార్థ జంక్షన్, జమ్మిచెట్టు సెంటర్, నైస్‌బార్ జంక్షన్, మెట్రో జంక్షన్, చుట్టగుంట సెంటర్ మీదుగా రాకపోకలుసాగించాలి.

పార్కింగ్‌ప్రదేశాలు

మేరీమాత ఉత్సవాలకు వచ్చే భక్తులు వారి వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ప్రత్యేక స్థలాలను కేటాయించినట్లు సీపీ రాణా తెలిపారు. విజయవాడ సిటీ, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, హైదరబాద్ ప్రాంతాల నుంచి భక్తులు వారి వాహనాలను పడవల రేవు సమీపంలోని మధురానగర్ వంతెన వద్ద, బీఆర్‌టీఎస్ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. మచిలీపట్నం, ఏలూరు, గన్నవరం, పటమల ప్రాంతాల నుంచి వచ్చే వారు జియాన్ బైబిల్ కాలేజీ మైదానం, ఈ మైదానానికి ఎదురుగా ప్రవేటు ఖాళీ స్థలం, ఈఎస్ఐ ఆస్పత్రి మైదానం, డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కాలేజీ మైదానంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.

మొబైల్‌కోర్టులో పలువురికి జరిమానా



మొబైల్ కోర్టులో కౌన్సెలింగ్ ఇస్తున్న మున్సిపల్ జడ్జి రామ్మోహన్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవీధులలో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని మొబైల్ కోర్టు జడ్జి యు.రామ్మోహన్ అధికారులను ఆదేశించారు. మొబైల్‌కోర్టు చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై నమోదైన 48 కేసుల్లో నిందితులను అధికారులు న్యాయమూర్తి ముందు హాజరుపరచారు. ఈ సందర్భంగా వారందరికీ రూ.14,970 జరిమానా విధించారు. జరిమానా విధించిన వారిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నవారు, విచ్చలవిడిగా పశువులను రోడ్ల పైకి వదిలేసిన వారు, రోడ్ల పై చెత్త వేసే వాళ్లు ఉన్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. జోనల్ కమిషనర్ సుధాకర్ పాల్గొన్నారు.